క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



నందవరంలో చలి వేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ తోట సావిత్రి

నందవరం : మండల కేంద్రం నందవరంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని శనివారం గ్రామ సర్పంచ్ తోట సావిత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివప్పగౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్‌లో ప్రతిభ



కటిక రక్షిత, వడ్డే చైతన్య, పింజారి షేక్షావలి

ఆదోని రూరల్: ఏపీ ఈసెట్ ఫలితాల్లో భీమా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్‌లో 500లోపు ర్యాంకులు ఐదుగురు, 1000 ర్యాంకుల్లో 10 మంది సాధించారన్నారు. 500 లోపు ర్యాంకుల్లో కటిక రక్షిత (255 మార్కులు), వడ్డే చైతన్య (337 మార్కులు), పింజారి షేక్షావలి (403 మార్కులు) సాధించారన్నారు. వారిని కళాశాల యాజమాన్యం అభినందించారు. తమ కళాశాలలో అందించిన ఉచిత శిక్షణ ద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వానరం మృతి



మృతి చెందిన వానరానికి పూజలు చేస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో ఓ వానరం ప్రమాదవశాత్తును విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. శుక్రవారం రాత్రి వర్షం కురువడంతో గ్రామంలో ఓ విద్యుత్ తీగ తెగి వేలాడుతోంది. ఆ వానరం తీగను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడి చనిపోయింది. గమనించిన గ్రామ ప్రజలు వానరానికి పూజలు చేసి, గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను జరిపించారు.

వ్యక్తిగత కంపోస్టు పిట్‌లతో రైతులకు మేలు



వ్యక్తిగత కంపోస్టు పిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మణి మంజరి

గోనెగండ్ల : వ్యక్తి గత కంపోస్టు పిట్ (గుంత)లను ఏర్పాటు చేసుకోవడం వలన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. శనివారం మండలంలోని పుట్టపాశం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన వ్యక్తి గత కంపోస్టు పిట్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ప్రతి రైతు వ్యక్తి గత కంపోస్టు పిట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల పేడ, వేస్టయిన మేతను ఆ కంపోస్టు పిట్‌లో వేసుకుంటే ఎరువు తయారు అవుతుందన్నారు. ఎరువును పంట పొలాల్లో వేసుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంత సేన, ఏపీఓ మహమ్మద్ బాషా, ఈసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు.. అడ్డగోలు విక్రయాలు

- రెచ్చిపోతున్న రియల్టర్లు
- అనుమతులు లేకుండానే వెంచర్లు
- పంచాయతీ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం



గోనెగండ్లలోని ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారి పక్కన అక్రమంగా వేసిన లేఅవుట్

గోనెగండ్ల: మండలంలో అక్రమ లేఅవుట్లు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవసాయ భూముల్లో లేఅవుట్లు వేసి ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా రియల్టర్లు వ్యవసాయ భూమిని ప్లాట్లుగా వేసి అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. దంతో ప్లాట్లు కొన్న అమాయక ప్రజలు మోసపోవడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అయినా రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయడం తప్ప చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్చరికలు బేఖాతరు..

మండల కేంద్రంలో నిబంధనలు గాలికి వదిలి భూమికి ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ అప్రూవల్ లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. గోనెగండ్లలోని వీవర్స్ కాలనీ ఎదురుగా ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి పక్కన 626/1 లో 1.90 సెంట్లలో అక్రమ లేఅవుట్లు వేశారు. ఈ సర్వే నెంబర్‌లో అనుమతులు లేకుండా లే అవుట్ వేయరాదని రియల్టర్లకు అధికారులు హెచ్చరించినప్పటికీ వాటిని బేఖాతరు చేసి గత వారంలో వెంచర్ పనులను చేపట్టారు. అలాగే మండలంలో గోనెగండ్ల తదితర ప్రాంతాల్లో అనుమతులు లేని లే అవుట్లు వేస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. దీంతో పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. అలాంటి లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు భవిష్యతులో ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులున్నాయి. అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్న రియల్టర్ల వద్ద సంబంధిత అధికారులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

లే అవుట్ పరిశీలన

గోనెగండ్లలోని వివర్స్ కాలనీలో అనుమతులు లేకుండా వేసిన లే అవుట్‌ను కూడా అధికారులు కొద్ది రోజుల క్రితం పరిశీలించి, వ్యవసాయ భూమికు ల్యాండ్ కన్వర్షన్ లేకుండా, కూడా అనుమతులు లేకుండా లే అవుట్ వేసి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

నోటీసులు ఇచ్చాం



ప్రభుత్వ అనుమతిలేకుండా లేఅవుట్లు వేస్తే అడ్డుకుంటాం. ప్రస్తుతం గోనెగండ్లలో ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిలో వేసిన లే అవుట్ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఆ రియల్టర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తే సంబంధిత రియల్టర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. – సతీష్, ఇన్‌చార్జ్ ఈఓ, గోనెగండ్ల

ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లకు న్యాయం చేయాలి

ఆదోని సెంట్రల్: ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్ ఆచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య ముఖ్య కార్యదర్శుల సమావేశాన్ని శనివారం స్థానిక నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదోన్నతుల ప్రక్రియలో మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కేటాయించిన ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టును పాత విధానంలోనే ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టుగా పరిగణించి, సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. అర్హతలు ఉండి ఇప్పటికీ గ్రేడ్-2 లాంగ్వేజ్ పండితులుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న వారికి న్యాయం చేయాలన్నారు. సమాంతరంగా తెలుగు మీడియం, మైనర్ మీడియంలను కొనసాగిస్తూ స్టాఫ్ ప్యాట్రన్ ప్రకారం ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌కుమార్, జంగం బసవరాజు, బడుగు బసవరాజు, దస్తగిరి, చంద్రమౌళి, మద్దయ్య, ఆనంద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈఈ హరి

ఆదోని అర్బన్: రాయితీపై ఇంటిపై సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకుని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవడంతో పాటు ఉత్పత్తి అయిన విద్యుత్‌తో ఆదాయం పెంచుకోవచ్చని విద్యుత్‌శాఖ డీఈఈ హరి, ఏడీఈ పురుషోత్తం అన్నారు. శనివారం స్థానిక డీఈఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటి పైకప్పు నుంచి సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. దీంతో విద్యుత్ ఆదా చేసుకోవడంతోపాటు ఆదాయం పెంచుకుని, ఓల్టేజ్ సమస్యలు, అంతరాయం లేకుండా విద్యుత్ పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీగా ఈ పథకాన్ని అందిస్తుందన్నారు. ఒక కిలో వ్యాట్ సామర్థ్యంతో 120 యూనిట్లు వస్తుందని, ఇందుకు ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. కేవలం మధ్యతరగతిలో ఉన్న గృహిణిలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, పరిశ్రమలకు, హోటళ్లకు, ఆసుపత్రులకు, అపార్ట్‌మెంట్లకు ఈ పథకం వర్తించదని తెలిపారు. ఇప్పటివరకు 50 మంది విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపారన్నారు.

జంతు సంతతి నియంత్రణ కేంద్రం ప్రారంభం



జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ సురేష్

ఆదోని టౌన్: పట్టణంలోని 2వ వార్డు బోయగేరిలో శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ, 2వ వార్డు కౌన్సిలర్ సురేష్, హెల్త్ ఆఫీసర్ సురేంద్ర ఆధ్వర్యంలో జంతు సంతతి నియంత్రణ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ ప్రజలకు హానీ కలిగించే జంతువులకు అవసరమైన టీకాలు, ఆపరేషన్లు తదితర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా వీధి కుక్కల నియంత్రణలో భాగంగా వాటికి టీకాలు వేయడం, సంతతి పెరగకుండా ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో ఇప్పటివరకు 4,500 వరకు కుక్కలు ఉన్నాయని, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించనున్నామని చెప్పారు.

స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్/టౌన్: మండల పరిధిలోని బనవాసి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కాలేజీ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెటర్నరీ కాలేజీకి 276 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. కొంత మంది కాలేజీ భూమిలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పంటలు సాగుచేసుకుంటున్నారని చెప్పారు. కాలేజీ స్థలం కబ్జాకు గురవతున్నా కాలేజీ యాజమాన్యం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెటర్నరీ కాలేజీ భూమిని అక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అక్రమార్కుల కబంద హస్తాల నుంచి భూమికి విముక్తి కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రమోద్, తన్వీర్, ప్రవీణ్, మార్కు, వీర తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మారడంవల్లే అధిక రక్తపోటు



ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది

నందవరం: జీవనశైలి మారడంతో అధిక రక్తపోటు (హై బీపీ) బాధితులు పెరుగుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. అధిక రక్తపోటుతో ఆరోగ్యానికి హానికరమని, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, శ్రమ లేక పోవడం, ఆహారపు అలవాట్లు, వంశ పారంపర్యం, మద్యపానం, దూమపానం, ఆహారంలో ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలన్నారు. అనంతరం ప్రజలకు రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బలరాముడు, పీహెచ్ఎన్ మరియమ్మ, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసులు, నరసింహులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చింతకుంటలో పడిపోయిన విద్యుత్ స్తంభాలు,



కోసిగి పంచాయతీ కార్యాలయం ముందు ఆగి ఉన్న వర్షం నీరు

గాలీవాన బీభత్సం



నెరుడుప్పలలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గోనెగండ్ల: వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలితో మోస్తరు వర్షం కురిసింది. దీంతో మండలంలో అక్కడక్కడ కొన్ని విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నెరుడుప్పల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లు నెలకొరిగాయి. దీంతో రాత్రి మండలంలో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం 14.8 మీల్లీ మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ రావు సిబ్బందితో కలిసి శనివారం మండలంలో నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మార్లను పరిశీలించారు. వెంటనే విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోసిగిలో ఉరుములు, మెరుపుల వాన

కోసిగి: మండలంలో శుక్రవారం రాత్రి భారీగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈదురు గాలులకు 24 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఇందులో చింతకుంటలో 5, వందగల్లులో 5, జుమ్మాలదిన్నెలో 7, ఆర్లబండలో 4, పల్లెపాడు 3 చొప్పున స్తంభాలు విరిగి పోయాయి. రాత్రిల్లో పొలాలల్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదాలు జరగలేదు. అయితే ఆయా గ్రామాల్లో, పొలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలో 9.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోసిగి రోడ్డులో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న మూడంతస్తుల భవన ఇటుక గోడ గుడిసెపై కూలడంతో గాయాలపాలైన వారిని ఆదుకొని, సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సత్యన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బాధితుల చికిత్సకు కాంట్రాక్టర్, ఇంజనీర్‌లే సహకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు,బాబు, వైపీఎల్ నాయకులు మునెప్ప, యుసఫ్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రధాన డ్రైనేజీల్లో పూడిక తీత పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. కర్నూలు రోడ్డులోని డ్రైన్‌లో పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టాలని, నీరు నిలువకుండా పనులు చేయించాలని ఇంజజీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా గంజిల్ల రోడ్డు, పార్క్‌రోడ్డు, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, సోమప్ప సర్కిల్‌లోని అన్నా క్యాంటిన్‌లో అల్పాహార పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రాజునాయక్, ఏఈ మదన్‌కుమార్ పాల్గొన్నారు.

21న డీఈఓ కార్యాలయ ముట్టడి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై ఈనెల 21న చేపట్టే డీఈఓ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలపై గత 30 వారాలుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుగుతున్నప్పటికీ ఫలించలేదన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందరూ పాల్గొని డీఈఓ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

పెద్ద ఎత్తున తరలిరావాలి

ఈనెల 21న జరిగే డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మరియు అకాడమిక్ కమిటీ మెంబర్ బి.మహాదేవప్ప పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, వీరాంజనేయులు, రామ్మోహన్ రెడ్డి, అంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

ముట్టడిని విజయవంతం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 21న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో సంఘ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ పరిరక్షణకై, ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎస్‌టీయూ నాయకులు ప్రసన్నరాజు, అడివన్న, ఎల్లప్ప, రామచంద్ర, నాగభూషణం, వెంకట్రాముడు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే ధ్యేయం



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ అన్నారు. పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టారేణుక సహకారంతో బుట్టా ఫౌండేషన్ ద్వారా రూ.4లక్షల విలువ చేసే జనరేటర్‌ను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన కళ్యాణ మండపంలో జనరేటర్‌ను ప్రారంభించగా ఆయనను పద్మశాలీ సంఘ నాయకులు, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు విశ్వనాథ్ రమేష్, సంఘ నాయకులు సత్కరించి బుట్టా దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజాహితం కోరి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిలా అర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, పట్టణ నాయకులు కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, మహబూబ్‌బేగ్, వెంకటాపురం రాజు, పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



అమాన్ అలీ తండ్రి షేక్షావలిని పరామర్శిస్తున్న బుట్టా శివనీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 12వ తేదీన బనవాసి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 18వ వార్డుకు చెందిన అమాన్ అలి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద తీరును మృతుడి తండ్రి ముబారక్ సీడ్స్ యజమాని షేక్షావలిని అడిగి తెలుసుకొని, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సోమేష్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, 34వ వార్డ్ ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రమేష్, మహబుబ్‌బేగ్, వెంకటాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పట్టణంలోని 4వ వార్డులో ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన చేనేత ఛాయ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టాశివనీలకంఠ రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జ్ కనికె నాగేంద్ర, రాష్ట్ర శాప్‌నెట్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు సహకరించాలి



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ ఉద్యోగులు



ఎమ్మిగనూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఆదోని టౌన్: పరిసరాల శుభ్రత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ప్రజల సహకారం ఎంతో అవసరమని కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ మాట్లాడారు. స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దడమే మన లక్ష్యమన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ చలపతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ఎమ్మిగనూరుటౌన్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమతుందని, పట్టణ వాసులు మొక్కలను పెంచి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, వార్డు సచివాలయ తదితర శాఖల సిబ్బంది నిర్వహించిన ర్యాలీని ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద జెండ ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు నీరజ, రజునాయక్, ఏఈలు మదన్‌కుమార్, శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, సత్యన్న, మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- కోసిగి: శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు , మేజర్ పంచాయతీ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యాక్రమం చేపట్టి ప్రతిజ్ఞ చేపట్టారు. కోసిగిలోని పాత పోస్టాఫీసు రోడ్డులో అధికారులు, సర్పంచ్, నాయకులు చీపు పట్టి రోడ్డును ఊడ్చారు. ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, నాయకులు ముత్తురెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సామాజన్ని స్థాపిద్దాం

కౌతాళం: ప్లాస్టిక్ రహిత సామాజాన్ని స్థాపిద్దామని ఎంపీడీఓ విజయ శేఖర రావు, సర్పంచ్ పాల్‌దినకర్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రమైన కౌతాళంలో నిర్వహించారు. గ్రామ పూర విదుల గుండా ర్యాలీ చేపట్టి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, స్వచ్ఛ ఆంధ్ర అవశ్యకతను వివరించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానహారంగా నిలిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాశం, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గోనెగండ్ల : ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రకజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. స్వచ్ఛంధ్ర, స్వచ్ఛ దీవస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఈఓ సతీష్, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావంగా ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: దేశ సైనికులకు సంఘీభావంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం రాత్రి జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా దేశ సైనికులు పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టి తమ సత్తాను ప్రపంచదేశాలకు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన శిక్షణ తరగతులు

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ తరగతులు మూడో రోజు శనివారం కూడా జరిగాయి. స్థానిక విశ్వనారాయణ జూనియర్ కాలేజీలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో 40 మంది కళాకారులు శిక్షణ పొందతున్నారు. కర్నూలు జిల్లా సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శిక్షణ తరగతులు కళాకారులను చైతన్యం చేయడానికి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావిరాజు, ప్రజా నాట్యమండలి జిల్లా ఆఫీస్ బేరర్స్ మాణిక్యం, బద్రి, శివరాముడు, రఘు తదితరులు పాల్గొన్నారు.